

వివరాలు మెయిన్‌లో

'స్థానిక'లో ప్రజాపాలనకే పట్టం : ఎమ్మెల్యే కుంభం

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శుక్రవారం | 05 డిసెంబరు , 2025 | పేజీలు : 06

# కొడంగల్‌లా దేవరకొండ అభివృద్ధి

### సిఎం రేవంత్‌రెడ్డిని కోరనున్న మంత్రి వెంకట్‌రెడి, ఎమ్మెల్యే బాలునాయక్

### సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

**ప్రజాపక్షం/దేవరకొండ:** సీఎం రేవంత్ రెడ్డి దేవరకొండ పర్యటన సందర్భంగా సభ ఏర్పాట్లను జిల్లా రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి , దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌లు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నియోజ వర్గం కొడంగల్ ఎలా అభివృద్ధి చేస్తుండో దేవరకొండ నియోజకవర్గం కూడా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రిని కోరనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్‌లు చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పాలన ప్రజలు ప్రేమతో స్వీకరిస్తున్నారని వారు చెప్పారు. శ్రీశైలం స్వరంగ మార్గాన్ని మూడు సంవత్సరాలలో పూర్తి చేసుకొని జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు, అందేటట్లు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి చెప్పారు. ఇదే దేవరకొండలో పదేండ్లు పాలన చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుర్చీ వేసుకొని నక్కలగండిని పూర్తి చేసి నల్లగొండ జిల్లాని సస్యశ్యామలం చేస్తానని చెప్పిన పెద్దయన టెంకడు మట్టి కూడా తీయలేదని మంత్రి అన్నారు.



ఎనిమిది వేల కోట్లు ఆదాయం ఆర్టీసి సంస్థకు చెల్లించి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కొనసాగుతుందని మంత్రి అన్నారు. సన్న బియ్యం పేద ప్రజలకు అందించడంలో ఐదు వేల కోట్లు ఖర్చు భారమైన ప్రభుత్వం వెనుకాడకుండ ముఖ్యమంత్రి తినే సన్న బియ్యం పేద ప్రజలు కూడా తినాలని దేశంలో ఎక్కడలేని విధంగా ఆలోచించి మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి అందిస్తున్నారని ఆయన అన్నారు. సొరంగంలో జరిగిన ప్రమాద ఘటనతో పనులు కొంత ఆలస్యమైనా పూర్తి చేసుకుని ఈ ప్రాంతానికి సాగు, త్రాగునీరు అందించే భాద్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని మంత్రి గుర్తు చేసారు. విధ్యుత్ భారం కాకుండానే శ్రీశైలం సొరంగ మార్గం పూర్తి చేసుకుని గ్రావిటీ ద్వారా సాగు త్రాగు నీరు అందించేందుకే ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దేవరకొండ నియోజక వర్గం కొడంగల్ మాదిరిగా దత్తత తీసుకుని అభివృద్ధి చేసేందుకు తాము ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు మంత్రి చెప్పారు. పేద ప్రజలు విద్యకు దగ్గర కావడానికి 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూలను ప్రారంభించుకొని పేద



వారికి నాణ్యమైన విద్యను అందించేందుకే ముఖ్యమంత్రి ముందుకెళ్తున్నట్లు మంత్రి చెప్పారు. ఈ నియోజకవర్గంలో గతంలో ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి చేసిన అభివృద్ధి తప్ప మళ్ళీ రేవంత్ రెడ్డి హయంలోనే నియోజకవర్గం అన్ని రంగాల అభివృద్ధి చెందుతుందని మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. మంత్రి వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, ముక్కమాల వెంకటయ్య గౌడ్, జాల నరసింహా రెడ్డి, ఏ.వి.రెడ్డి, ఎం.డి యూనిస్, పొన్నబోయిన సైదులు తదితరులు ఉన్నారు.

# రసవత్తరంగా పల్లెపోరు...

### గ్రామాల్లో హోరెత్తనున్న ప్రచారం.....

### గ్రామాల్లో ఊపందుకున్న అభ్యర్థుల ప్రచారం...

**ప్రజాపక్షం /భువనగిరిరూరల్:** పల్లె పోరు రసవత్త రంగా మారింది. మొదటి దశ పంచాయతీ ఎన్నికల కు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం బుధవారంతో ముగిసింది. ఈ మేరకు ఆయా గ్రా మాల వారీగా బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. గురువారం నుంచి ప్రచారం ఊపందుకోనుంది. మరోవైపు రెండో విడతలో నా మినేషన్ల స్కూటినీ ప్రక్రియ ముగియగా.. షెడ్యూల్లో భాగంగా చివరి దశ నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఈ క్రమంలో పల్లె రాజకీయాలు ఉత్కంఠ రేపుతున్నాయి. పలు గ్రామాల్లో అధికార కాంగ్రెస్లో పాత, కొత్త (ఇతర పార్టీల నుంచి చేరిన వారు) నేతల మధ్య సర్పంచ్ పదవి కోసం నువ్వా, నేనా అన్నట్లు పోరు అనివార్యంగా మారడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ పరిణామాలు ఆ పార్టీ ముఖ్య నేతల్లో గుబులు పుట్టిస్తున్నాయి.

సర్పంచ్, వార్డు సభ్యుడికి వేర్వేరు గుర్తులు ఉండనున్నాయి. ముఖ్యంగా సర్పంచ్ల బ్యాలెట్ పేపర్ పింకు కలర్లో ఉండగా, వార్డు సభ్యుల బ్యాలెట్ తెలుపు రంగులో ఉంటుంది. సర్పంచ్లకు సంబంధించి 30, వార్డు సభ్యులకు 20 గుర్తులను కేటాయించారు. ఇందులో ఉంగరం, కత్తెర, బ్యాట్, ఫుడ్‌బాల్, లేడీ పర్సు, టీవీ రిమోట్, టూత్ పేష్ట్, స్పానర్, చెత్తడబ్బ, బ్లాక్ బోర్డు, బెండకాయ, కొబ్బరి తోట, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, టీ జల్లెడ, చేతి కర్ర, మంచం, పలక, బ్యాటరీ లైట్, బ్రెష్, బ్యాట్స్మెన్, మనిషి తేప పడవ, బిస్కెట్, వేణువు, చైన్, చెప్పులు, గాలి బుడగా, స్టాంపు తదితర గుర్తులను సర్పంచ్లకు కేటాయించారు. గౌను, గ్యాస్ పొయ్యి, స్టూలు, గ్యాస్ సిలిండర్, బీరువ, ఈల, కుండ, గరిట, డిష్ యాంటినా, మూకుడు, ఐస్ క్రీమ్, గాజు గ్లాసు, పోస్టు డబ్బ, కవర్, హాకీ మరియు బంతి, నెక్ టై, కటింగ్ ప్లేయర్, పెట్టే, విద్యుత్ స్థంబం, కేటిల్ గుర్తులను వార్డు సభ్యులకు కేటాయించారు. అయితే వార్డు సభ్యులకు అవసరమైన ఖర్చులు సైతం సర్పంచ్గా పోటీ చేసే అభ్యర్థులపైనే పడుతుంది. ఒక్కో వార్డుకు రూ.50 వేల




నుంచి రూ.లక్ష వరకు ఖర్చు తప్పేలా లేదని పోటీలో ఉన్న అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. గుంపులు, గుంపులుగా తిప్పుకోకుంటే తాము ఎక్కడ వెనుకబడ్డా మోనన్న ప్రచారం మొదలవుతుందన్న బెంగ అభ్యర్థులను పట్టి పీడి స్తోంది. దీంతో వెంట వచ్చే వారికి కూలీ, దావత్ ఇస్తామంటూ నచ్చచెబుతూ వెంట తిప్పుకుంటు న్నారు. గ్రామాలకు పెద్ద నాయకులు ప్రచారానికి వచ్చిన సందర్భాల్లో ఎక్కువ మందిని సమీకరించ టంతో ఎక్కువ ఖర్చు అవుతుంది. కాగా పోటీల్లో ఉన్న అభ్యర్థులు ఖర్చుకు వెనుకాడని పరిస్థితులు కనిపిస్తున్నాయి.

గుర్తులు కేటాయించగానే అభ్యర్థులు సోషల్ మీడి యాలో ప్రచారం మొదలుపెట్టారు. గుర్తులతో కూడిన కరపత్రాల ప్రింటింగ్, ప్రచారానికి అవసర మైన మైక్ పర్మిషన్లు, ఫ్లెక్సీలు, పోస్టర్ల ప్రింటింగ్ కార్యక్రమం చకచకా జరిగిపోతున్నాయి. ప్రచారపర్వంలో పాల్గొనేందుకు వార్డులవారీగా టీమ్లను సిద్ధం చేసుకుంటున్నారు. బరిలో నిలిచే అభ్యర్థులు ఎవరో తేలిపోవటంతో గ్రామాల్లో గెలుపోటములపై చర్చలు మొదలయ్యాయి. కొందరు బెట్టింగ్ల తో సవాల్ విసురుతున్నారు. తొలివిడత ఎన్నికల ప్రచారానికి ఆరురోజులు మాత్రమే గడువు ఉండ టంతో అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. కొందరు అభ్యర్థులు





తాము గెలిస్తే గ్రామాన్ని ఏవిధంగా అభివృద్ధి చేస్తామో సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. గుర్తులు కేటాయించిన తర్వాత గ్రామాల్లో ఎన్నికల వాతావ రణం ఒక్కసారిగా వేడెక్కింది. ఓటర్ల ఇచ్చే హామీలు, తాయిలాలపై అభ్యర్థులు మద్దతుదారు లతో సమీక్షించుకుంటున్నారు. ప్రత్యర్థుల బలాలు, బలహీనతలపై దృష్టి పెట్టి ప్రజల మద్దతు కూడగట్టుకునేలా వ్యూహరచన చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అభ్యర్థులకు ఆర్థికభారం కాకుండా అధికార, ప్రతిపక్ష పార్టీలు సంయుక్తంగా ఒప్పందాలు చేసుకుని ఏకగ్రీవాలు చేసుకుంటున్నాయి.



## ఎన్నికల వ్యయ తనిఖీలు

**ప్రజాపక్షం/మోతె :** మండలంలోని సింగరేణిపల్లె టోల్‌ప్లాజా వద్ద ఎన్నికల వ్యయ పరిశీలన అధికారి బి హుస్సేన్ గురువారం ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఎన్నికల సమయంలో ఎక్కువ మొత్తం డబ్బులు, మద్యం బాటిల్లు ఒక చోటు నుంచి మరొక చోటుకు చేరవేయడం నేరమన్నారు. తరలిస్తూ పట్టుబడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్ఐ కర్ణాకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## తూకాలలో తేడాలు సహించం



**ప్రజాపక్షం/మోతె :** తూకాలలో తేడాలు ఉంటే సహించేది లేదని డిసిఓ ప్రవీణ్ అన్నారు. గురువారం మండలంలోని నేరేడువాయి గ్రామంలోని వడ్డెరగూడెంలో పిఏసిఎస్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తేమ శాతం తక్కువ ఉన్న ధాన్యం మాత్రమే కాంటాలు వేయాలని, 41 కేజీలలోపు మాత్రమే కాంటాలు వేయాలని తెలిపారు. ప్రతి కేంద్రం వద్ద రైతులకు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఇఓ ఉపేందర్, రైతులు పాల్గొన్నారు.

## జిల్లాలో కార్మికశాఖ రెగ్యులర్ అధికారులను నియమించాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను దృష్టిలో పెట్టుకుని కార్మిక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని సిఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్యగౌడ్ అన్నారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సూర్యాపేట జిల్లాలోని తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ మండలిలో ఇప్పటి వరకు సుమారు లక్ష 36వేలకు పైగా భవన నిర్మాణ కార్మికులు నమోదయ్యారని, ఐతే వారి సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు జిల్లాలో రెగ్యులర్ అధికారి లేరని ఆవేదన వ్యక్తం చేశారు. నెల 7,8,9 తేదీలలో మెదక్‌లో జరిగే సిఐటియు రాష్ట్ర నాల్గవ మహాసభలకు ప్రతినిధిగా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ఆయనను రాష్ట్ర కమిటి ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు ధనావత్ నెహ్రూ, పెయింటింగ్ వర్కర్స్ నాయకులు తురక నరే ష్, అమరబోయిన నాగేంద్రబాబు, శ్రీను, బాబా, సారయ్య, సైదమ్మ, కోటయ్య పాల్గొన్నారు.




## ఎన్నికల ప్రవర్తన నియమవాళి పాటించాలి

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోటీలో ఉన్న ప్రతి అభ్యర్థి ఎన్నికల ప్రవర్తన విధానాలు తప్పక పాటించాలని సూర్యాపేట జిల్లా డిఎస్‌పి ప్రసన్నకుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సిరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల ప్రవర్తన విధానాలు)పై పోటీ చేసే అభ్యర్థులకు అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గ్రామాల్లో అనవసరంగా చిన్న చిన్న తగాదాలు జరిగిన ప్రోత్సహించిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పని అన్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో రౌడీషీటర్‌లను గుర్తించామని వారిని బైండోవర్ చేశామని తెలిపారు. ఓటర్లను ప్రలోభపెట్టడం డబ్బు, మద్యం, బహుమతులు పంపిణీ జరిపినా అందులకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని వారి అభ్యర్థిత్వాన్ని కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. సోషల్‌మీడియాపై



పోలీసులు నిఘా ఉంటుందని అసభ్యకరమైన, విద్వేషకరమైన పోస్టులు పెట్టే వారిపై చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. జిల్లాలో 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉందన్నారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన 45 రోజుల లోపల పోటీ చేసిన ప్రతి అభ్యర్థి తన మొత్తం ఎన్నికల ఖర్చుల వివరాలను స్థానిక ఎంపిడిఓకి సమర్పించాలన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి పై అభ్యర్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దయానందం, ఎంపిడిఓ శేషుకుమార్, సిఐ నరసింహారావు, ఎస్ఐ క్రాంతి కుమార్‌తోపాటు వివిధ గ్రామాలలో పోటీచేసే సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యుల అభ్యర్థులు పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు



డిఎస్‌పి ప్రసన్న కుమార్

**ప్రజాపక్షం/నూతనకల్ :** ఈనెల 11న జరగనున్న గ్రామ పంచాయితీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట డివిజన్ డిఎస్‌పి ప్రసన్నకుమార్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గ్రామ పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులందరికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల నియమావళిని పాటిస్తూ ఎన్నికలు నిర్వహించుకోవాలని, ఎన్నికల నియమాలని ఉల్లంఘించినట్లయితే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, తుంగతుర్తి సిఐ నరసింహారావు, మండల అభివృద్ధి అధికారి సునీత, ఎస్ఐ నాగరాజు, వ్యయ పరిశీలక అధికారి, వివిధ పార్టీల నాయకులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## నియమ నిబంధనలు పాటించాలి

**ప్రజాపక్షం/అర్వపల్లి :** ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని మండల తహశీల్దార్ బి శ్రీకాంత్, నాగారం సిఐ నాగేశ్వరరావు, ఎంపిడిఓ బి ఝాన్సీలు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో సర్పంచ్‌లు, వార్డు సభ్యులుగా పోటీచేస్తున్న నాయకులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పాటించిన విధివిధానాలను వివరించారు. ఎన్నికల సమయంలో ప్రవర్తన నియమావళి, ఎన్నికల ఖర్చు, ప్రచారం కోసం అనుమతులు, పోస్టల్ బ్యాలెట్, ఇంటి వద్ద ఓటింగ్ ఎన్నికల సమయంలో చేయవల్సిన పనులు చేయాలని అవగాహన కల్పించారు. ప్రచారానికి సంబంధించిన వాహనాలు లౌడ్ స్పీకర్లు, సమావేశాలు, ఊరేగింపులు ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఈట సైదులు, ఎంపిఓ గోపి, మండల పరిధిలోని వివిధ గ్రామ పంచాయితీ పరిధిలో పోటీ చేసే అభ్యర్థులు, నాయకులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్‌ను గెలిపిస్తే అవినీతికి లైసెన్స్ ఇచ్చినట్లే

**మాజీ రాజ్యసభ సభ్యులు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్**

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** కాంగ్రెస్ పార్టీని స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపిస్తే అవినీతికి లైసెన్స్ ఇచ్చినట్లేనని మాజీ రాజ్యసభ సభ్యులు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్ విమర్శించారు. గురువారం జిల్లా బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు ఘనవిజయం సాధించనున్నారని, మెజార్టీ పంచాయతీలను బిఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.345కోట్ల గ్రామాలకు కేటాయించి గ్రామ స్వరాజ్యం తెచ్చారన్నారు. గ్రామాల్లో ట్రాక్టర్లు, వైకుంఠదామాలు, నర్సరీలు, పల్లెప్రకృతి వనాలు, సెగ్రిగేషన్ షెడ్లు ఏర్పాటు చేసి అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. నేటి కాంగ్రెస్



ప్రభుత్వం మున్సిపాలిటీలకు గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని మోసం చేసిందన్నారు. హైదరాబాద్‌లో పారిశ్రామిక వాడలకు ఇచ్చిన భూములను అమ్ముకునే ఆలోచన చేస్తున్నారని ఇది రూ.5లక్షల కోట్ల భారీ కుంభకోణం అని దోచుకో దాచుకో పంచుకో అన్న రీతిలో కాంగ్రెస్ వ్యవహరిస్తుందన్నారు. ఈ సమావేశంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టకిషోర్, మాజీ ఎంపిపి నెమ్మాది బిక్షం ఉన్నారు.

## జిల్లాలో 30 పోలీస్ యాక్ట్


**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఈనెల 31వ తేదీ వరకు 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్‌పి కె నరసింహా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో పోలీస్ అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని హెచ్చరించారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారితీసే సమావేశాలు, జనసమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్‌మీడియా నందు అనవసరమైన విషయాలను, అసత్యాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం చర్యలు తప్పవని పేర్కొన్నారు. బాణాసంచా, డిజెలు ఉపయోగించవద్దన్నారు.

## బెల్ట్‌షాపులపై కేసు నమోదు



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** గ్రామ పంచాయతీ ఎన్నికల మండల పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్ డ్యూటీలో భాగంగా పర్యవేక్షణలో రావులపల్లి ఎక్స్ రోడ్డు తండ వద్ద బెల్ట్‌షాప్‌ను చెక్ చేయుచుండగా ఎలాంటి అనుమతులు లేకుండా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్ముచుండగా గుగులోతు గోపాల్ వద్ద 9.75 లీటర్ల బీర్లు, 1.08 లీటర్ల లిక్కర్ సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. వెలుగుపల్లి 365 బైపాస్ రోడ్డులో ఎన్నికల వాహనాన్ని గుర్తించి బైక్‌పై వెళ్లుచున్న ముగ్గురు వ్యక్తులు రోడ్డు పక్కన 5.85 లీటర్ల బీర్లు, 2.73 లీటర్లు సుమారు రూ.8,090 విలువ గల లిక్కర్‌ను స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ తుంగతుర్తి స్వాధీనం చేసి కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని ఎవరైనా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ గురుస్వామి, కానిస్టేబుల్ మహేష్, సాయివర్మ, వీడియోగ్రాఫర్ మధు, మహేష్ పాల్గొన్నారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పట్టణంలోని వాగ్దేవి హై స్కూల్‌లో గురువారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా, రాష్ట్రమంత్రులుగా, కలెక్టర్, డిఇవో, ఎఇవో, ప్రిన్సిపాల్ వేషదారణలో తమ తమ పాత్రలను పోషించి అలరించారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ జాల జ్యోతిబాబు, ప్రిన్సిపాల్ నిడిగొండ గంగాధర్ లు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రమ శిక్షణతో వారు పోషించిన పాత్రలను నిజజీవితంలో సాధించి ఉన్నత శిఖరాలను అదిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగలక్ష్మి, మౌనిక, రుక్షణ, సుష్మా, కళ్యాణి, మనీషా, ఉమ, సునిత, మనోజ, జ్యోతి, విజయశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## పంచాయతీలకు భారీగా నామినేషన్లు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల క్లస్టర్‌లో సుద్దాల, అనంతారం, బ్రాహ్మణపల్లి గ్రామాలలో భారిగా నామినేషన్లు వచ్చాయి. సర్పంచులు, వార్డు సభ్యులు నామినేషన్లకోసం క్యూలో నిలబడ్డారు అని పోలింగ్ ఆఫీసర్ 5 గంటల లోపు వచ్చిన వారికి టోకెన్లు ఇచ్చి క్యూలో నిలబడినవారి అందరి నామినేషన్లను తీసుకుంటామని వారికి సూచించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆశావాహులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి

**ప్రజాపక్షం/కోదాడ:** రాష్ట్ర స్థాయి కబాడీ పోటీలో జిల్లా జట్టు రాణించి జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారులు ఎంపిక కావాలని జిల్ల కబాడీ అసోసియేషన్ అధ్యక్షులు అల్లం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం కోదాడ కెఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల క్రీడామైదానంలో జిల్లా కబాడీ జూనియర్ బాలుర జట్టు ఎంపికలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 5 నుండి 7 వరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించు రాష్ట్ర స్థాయి కబాడీ పోటీలో జిల్లా జట్టు పాల్గొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కా ర్యదర్శి ఎన్.నరసింహారావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## గాలయ్య మృతి పట్ల సంతాపం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణానికి చెందిన నాయి బ్రాహ్మణుడు జంపుల గాలయ్య అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆలగడప గిరిధర్‌లు గాలయ్య మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. సంఘం తరుపున రూ.12వేలను కుటుంబసభ్యులకు అందించారు. సంతాపం తెలిపిన వారిలో సంఘం గౌరవ అధ్యక్షుడు వెలిజాల హనుమంతు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాయించు నరసింహా, గోలి గిరి తదితరులు ఉన్నారు.

## గురుదత్త జయంతి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని హనుమాన్ పేట శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో గురుదత్త జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గౌరు దయాకర్, నీలా పాపారావులు మాట్లాడుతూ గురుదత్త జయంతి సందర్భంగా దత్తాత్రేయ వ్రతాన్ని నిర్వహించినట్లు తెలిపారు. గురువారం పౌర్ణమి, కృతికా నక్షత్రం రోజు దత్త దత్తాత్రేయ జయంతి రావడం విశేషమన్నారు. సాయిబాబా, దత్తాత్రేయ స్వాములకు తెల్లవారుజామున పంచామృతాభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు జరిపి, దాములూరి పూర్ణయ్య శర్మ ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో దత్తాత్రేయ వ్రతాన్ని భక్తుల నడుమ ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించినట్లు తెలిపారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు మంచుకొండ వెంకటేశ్వర్లు, జా యింట్ సెక్రటరీ గంధం సైదులు, లక్ష్మీనారాయణ, సాంబశివరావు, శ్రీనివాస్, కీర్తి అశోక్, భక్తులు పాల్గొన్నారు.



# అక్రమంగా నామినేషన్ ఆమోదం

### అధికారులపై చర్యలు తీసుకోవాలి

### బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి సోమ రాజేశ్వరి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నిబంధనలకు విరుద్ధగా అక్రమంగా నామినేషన్ ఆమోదం తెలిపారని దామరచర్ల బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి సోమరాజేశ్వరి ఆరోపించారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి బంటు రేణుకసిరిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నామినేషన్ల స్క్రూట్నీ అయిపోయాక దామరచర్ల సర్పంచ్ పదవికి 12 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదించినట్లు అభ్యర్థుల లిస్టు అంటించారని, బుధవారం అర్ధ రాత్రి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి బంటు రేణుకసిరి నామినేషన్ ఆమోదిస్తున్నట్లు 13వ పేరుగా చేర్చారని ఆరోపించారు. ఆమె నామినేషన్ ఆమోదంపై అనుమానాలు ఉన్నాయని, రాత్రికి రాత్రే నామినేషన్ ఎలా ఆమోదిస్తారని ప్రశ్నించారు. ఇప్పటివరకు దామరచర్ల ఓటర్ జాబితాలో ఆ అభ్యర్థి పేరు నమోదు కాలేదని, అయినప్పటికీ నామినేషన్ ఆమోదిస్తున్నట్లు ప్రకటించారని అన్నారు. అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్ ఆమోదించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, బంటు రేణుకసిరి నామినేషన్ను రిజెక్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎన్నికల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు సోమ సైదిరెడ్డి, కుందూరు వీరకోటిరెడ్డి, నారాయణరెడ్డి, హాతీరాంనాయక్, ప్రకాశ్‌నాయక్ పాల్గొన్నారు.

# చేయి విడిచి కారెక్కిన నేతలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గ్రామపంచాయతీ ఎన్నికల వేళా పార్టీ ఫిరాయింపులు కొనసాగుతున్నాయి. మాడుగులపల్లి మండలం పాములపాడు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట సత్తిరెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసి మాజీ సర్పంచ్ యాతం లక్ష్మి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక మిర్యాలగూడ పట్టణ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 14న జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి చింతకాయల సైదులు గెలుపుకై వంద మంది కాంగ్రెస్ ముఖ్య నాయకులతో పార్టీలో చేరడం శుభ పరిణామన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ




హయాంలో కేసీఆర్ ఆధ్వర్యంలో గ్రామాలు సంపూర్ణ అభివృద్ధి సాధించాయన్నారు. అదేవిధంగా కేసీఆర్ హయాంలో ప్రభుత్వ ఫలాలు అందిపుచ్చుకున్న వారే బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిని గెలిపిస్తారని చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, నాయకులు జెర్రిపోతుల రాములుగౌడ, యాతం లక్ష్మి నరేందర్‌రెడ్డి, జానయ్య, చింతకాయల సైదులు, వేముల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# దంతూరి సత్తయ్యకి ఘన సన్మానం



**ప్రజాపక్షం/వలిగొండ/రామన్నపేట :** వలిగొండ మండల కేంద్రానికి చెందిన అడ్వకేట్ దంతూరి సత్తయ్యను రామన్నపేట అదనపు కోర్టుకి సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా ఎంపికై బాధ్యతలు చేపట్టిన సందర్భంగా రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండీ.మస్జిద్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి సభ్యులందరూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ జ్యుడిషియల్ వ్యవస్థలో నిబద్దతతో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ అవకాశాలు ఉంటాయని అన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ మాతో పాటు కలిసి పని చేసిన ఉన్నత హోదాలో వెల్లినందున సభ్యులందరూ శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ యాపాల కృష్ణ రెడ్డి, కంపాటి యాదగిరి, జినుకల ప్రభాకర్, కేమా రామదాసు, ఉయ్యాల హనుమంతు గౌడ్, బర్ల డేవిడ్, నకిరేకంటి మోగులయ్య, యాదాసు యాదయ్య, దినేష్ కుమార్, మామిడి వెంకట్ రెడ్డి, నోముల స్వామి, ఏళ్ల శ్రీశైలం పాల్గొన్నారు.

## ఎన్నికల్లో అభ్యర్థి వ్యయపరిమితి, చేయాల్సిన ఖర్చులపై అవగాహన

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** ఈ నెల 11న జరగబోయే స్థానిక రెండవ సాధారణ ఎన్నికల్లో మండలంలోని 33 గ్రామపంచాయతీల్లో పోటీ చేసే సర్పంచ్, వార్డు మెంబర్ల అభ్యర్థులకు వ్యయ పరిమితి, చేయాల్సిన ఖర్చులపై తుర్కపల్లి మండల కేంద్రంలోని జెఎం ఫంక్షన్ హాల్లో సంబంధిత అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎలక్షన్ ఎక్స్పెండిచర్ అడ్వైజర్ శ్రీనివాస్ పోటీ చేసే అభ్యర్థులకు మార్గ నిర్దేశం చేశారు. పోటీల్లో చేసే ఖర్చుల వివరాలపై క్లుప్తంగా వివరించి, అభ్యర్థులు పెట్టవలసిన ఖర్చు విషయాలు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల అధికారి, అడిషనల్ డిఆర్డిఓ గుర్రం సురేష్, మండల ఎలక్షన్స్ ఎక్స్పెండిచర్ అడ్వైజర్ వేణు, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, అభ్యర్థులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## విత్తనోత్పత్తి వేలంలో పాల్గొనాలి

**ప్రజాపక్షం/డిండి;** యాసంగి 2024/25 సీజన్‌లో డిండి వ్యవసాయ విత్తనోత్పత్తి క్షేత్రం నందు పండించిన వేరుశనగ (కదిరి6 రకం) కె6 రకం 73.8 క్వింటాళ్ల ఉత్పత్తి కోల్డ్‌స్టోరేజి, ఆమనగల్ నందు నిల్వచేయబడి ఉంది. ఇట్టి వేరుశనగ ఉత్పత్తిని తేది.0912 2025 నాడు ఉదయం 11 గంటలకు డిండి విత్తనోత్పత్తి క్షేత్రంలో బహిరంగ వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించ డం జరిగింది. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనగలరని ఏ.డి.ఏ, టి వాసు, గురువారం తెలిపారు.



## రోశయ్య సేవలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం/యాదాద్రి :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్‌గా పనిచేసిన కొణిజేటి రోశయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమానికి రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులతో కలిసి హాజరై రోశయ్య చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్ సుందర్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జగన్మోహన్ ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా చెట్టు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** అక్రమంగా తన భూమిలోని చెట్టును నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని లింగాల గ్రామానికి చెందిన దాచపల్లి యాదగిరి గురువారం జిల్లా అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. లింగాల గ్రామానికి చెందిన దాచపల్లి యాదగిరికి చెందిన భూమి సర్వే నెంబర్ 324/3లో 1 ఎకరం 10 గుంటల భూమి ఉండగా ఆ భూమిలో 15 సంవత్సరాల పెద్ద దిర్శన చెట్టు ఉంది. అదే గ్రామానికి చెందిన తన తమ్ముడు పోలీస్ కానిస్టేబుల్ దాచపల్లి అరవింద్ అక్రమంగా ఆ చెట్టును నగేష్ గౌడ్ అనే వ్యక్తికి అమ్ముకొనగా అది నరకడం జరిగింది. తమ భూమిలో ఉన్న చెట్టును అక్రమంగా తరలించడంతో పాటు అటవీ శాఖ అధికారులు అనుమతి లేకుండా నరికి వేసిన వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని వినతిపత్రం లో అధికారులను కోరారు.

## వ్యవసాయ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శికి పితృ వియోగం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఉన్నత శ్రేణి కార్యదర్శి యండి ఫసియుద్దీన్ తండ్రి నయిమోద్దీన్ (80) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. గతంలో ఆయన సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా పనిచేసి పదవి విరమణ పొందాడు. విషయం తెలుసుకున్న వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ ఫ్లోర్‌లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, శ్రీదండు మైసమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ తంగెళ్ళ కరుణాకర్ రెడ్డిలు వెళ్ళి పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించి కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు.





## ఆర్‌డిఓ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/చింతలపాలెం** : మండలంలోని దొండ పాడు క్లస్టర్ నందు ఎన్నికల నామినేషన్ ప్రక్రియను గురువారం హుజూర్‌నగర్ ఆర్‌డిఓ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి తప్పులు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ టి సురేందర్ రెడ్డి, ఎంపిడిఓ వివి రామచంద్రరావు, ఎంపిఓ భూపాల్‌రెడ్డి, గ్రామ పంచాయితీ కార్యదర్శి సైదులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప పడిపూజ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : పట్టణంలోని శ్రీనగర్‌కాలనిలో గురు వారం బాలరాజు,మనోహర్ గురుస్వాముల ఆధ్వర్యంలో ఘనంగా అయ్యప్ప పడిపూజ నిర్వహించారు.ఈసందర్భంగా చెరుకు వినోద్‌కుమార్ ప్రీతి అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజ చేశారు.అనంతరం అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో మేడం విశ్వ ప్రసాద్ గురు స్వామి,బండారు వెంకటేశ్వర్లు,సోమా వెంకటేశ్వర్లు,పద్మావతి,చౌక్కారపు మాధవి, వెంకన్న,ఆద్య,శ్రీ వాగ్దేవి,మిరియాల నిర్మల,దేవేందర్,గుమ్మడవెల్లి ధనయ్య,డాక్టర్ కజ్జం సందీప్, మంతెన మాధవి భక్తులు పాల్గొన్నారు.

## దత్త జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :దత్త జయంతి సందర్భంగా గురువారం పట్టణంలోని శివాజీ నగర్ షిరిడి సాయిబాబా మందిరంలో ఆలయ ప్రధాన పూజారి శనగల మురళీధర్ శర్మ పండ్ల రసాలతో,విభూది చందనంతో అభిషేకం నిర్వహించి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎనుగుల లక్ష్మారెడ్డి,వైస్ చైర్మన్ మందడి మధుసూదన్ రెడ్డి,దాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ,పూజారి సుబ్రహ్మణ్య శర్మ, అనంత రామ శర్మ,బిఫిన్ పాండే, మురారి శెట్టి సత్యనారాయణ,జగిని వెంకన్న,గుండా కోటప్ప, గోవింద రెడ్డి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

## సిపిఐ(ఎం) వార్డు అభ్యర్థుల నామినేషన్

**ప్రజాపక్షం/చింతలపాలెం** : చింతలపాలెం గ్రామ పంచాయితీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీ బలపరిచిన సిపిఎం పార్టీకి చెందిన షేక్ మస్తాన్, షేక్ ఖాసీంబి, షేక్ మౌలా, కారింగుల ముత్యం లు 5, 6, 7, 8 వార్డులకు అభ్యర్థులుగా గురువారం నామినేషన్లు వేశారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో కందుల సుందర మౌలేశ్వర్‌రెడ్డి, షేక్ రియాజ్, షేక్ రఫీ, అమరమైన శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.



## రాజేష్ సంస్మరణ సభ విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/కోదాడ:** పోలీసుల చిత్రహింసలతో మృతి చెందిన కోదాడ పట్టణానికి చెందిన కర్ల రజేష్ కుటుంబానికి న్యాయం చేయాలంటు ఈనెల 22 కోదాడ పట్టణంలో నిర్వహించు బారీ సంస్మరణ సభను విజయవంతం చేయాలని వివిధ పార్టీల నాయకులు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు పిలుపు నిచ్చారు. గురువారం కోదాడ పట్టణ ఎఆర్ ఆర్ ఫంక్షన్ హాల్ లో ఎమ్మార్పీఎస్ నాయకులు ఏపూరి రాజు అధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా సూర్యాపేట జిల్లాలో అక్ట్ 30ని తేవడంతో వారి ఉద్యేశ్యం ఏమిటని ప్రశ్నించారు. కర్ల రాజేష్ మృతిపై విచారణ చేపట్టి నిందితులపై చట్టపరమైన చర్యలు తసీకోవాలని ఎస్పీ, ఎమ్మెల్యే, రాష్ట్ర పోలీసు అధికారులకు వినతి పత్రాలు అందించి విన్నవించిని నేటికి వారిపై చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్నారు. సంస్మరణ వేదికగా వేలాది గొంతుకలతో మృతునికి కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో పట్టణ బిఆర్‌ఎస్ అధ్యక్షులు ఎస్‌కె నయీం, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద నరేష్‌మాదిగ, బిజేపీ నేత జనార్ధనరావు, సిపిఐఎంఎల్ న్యూడెమెక్రసీ నాయకులు రవికుమార్, మాలమహానాడు నాయకురాలు పిట్టల భాగ్యమ్మ, ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షులు సిహెచ్ సోమశేఖర్, వివిధ సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఓటర్లు తమ ఓటు హక్కు ప్రశాంతంగా వినియోగించుకోవాలని,ఎటువంటి ఘర్షణలకు తావు లేకుండా సహకరించాలని నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదా బాబు సూచించారు.గ్రామ పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గురువారం నల్లగొండ మండలంలోని చందనపల్లి గ్రామ ప్రజలతో మమేకమై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందునగా ప్రతి ఒక్కరు ఎన్నికల నియమాలు పాటించాలని సూచించారు.ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునే విధంగా పోలీస్ శాఖ అండగా ఉంటుందని, ప్రజా రక్షణ, భద్రత పోలీసుల లక్ష్యమని అన్నారు. ఓటు హక్కును ప్రశాంతంగా,స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ లాజరస్,కానిస్టేబుల్స్ నరసింహ,తిరుమలేష్, సర్పంచ్ అభ్యర్థి పెద్ది గోవర్ధన్ లక్ష్మి,గ్రామస్తులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రాష్ట్ర ము ఖ్యమంత్రి హిందూ దేవుళ్ళ పై అను చిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా బిజెపి జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలో గురువారం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో హిందువులను హిందూ దేవుళ్ళను అడుగడుగున అవమానిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నాయకులకి తగిన బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందన్నారు.ఒక వర్గం మెప్పు కోసం మైనారిటీల ఓట్ల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి హో దాలో ఉండి సీఎం రేవంత్ రెడ్డి హిందూ మనోభావాల దెబ్బ తీసే విధం గా మాట్లాడడం చాలా బాధాకర మని ధ్వజమెత్తారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల విద్యాసాగర్,పట్టణ అధ్యక్షులు గడ్డం మహేష్,మాజీ కౌన్సిలర్ కంకణాల నాగిరెడ్డి,జిల్లా కౌన్సిల్ మెంబర్ బిపంగి జగ్జీవన్ టూటౌన్ ప్రధాన కార్యదర్శి కటకం శ్రీధ ర్, మంగినపల్లి కిషన్,దాసరి కృష్ణ బిపంగి వినోద్,ఏరుకొండ హరి చింత శివరామ కృష్ణ,నరసింహ,పుల్లెంల శ్యామ్ పాల్గొన్నా రు.

## మా ఓటు: నోటుకు అమ్ముడు పోదు




**ప్రజాపక్షం/నార్కట్ పల్లి** : ప్రజా రాజ్యంలో వజ్రాయుధం లాంటి ఓటు హక్కును సేవా చేసే నాయకులను ఎన్నుకోవాలి గాని,నోటుకు అమ్ముడు పోవొద్దని నార్కట్‌పల్లి మేజర్ గ్రామ పంచాయతీ మాజీ వార్డ్ మెంబెర్ దేవరశెట్టి రుక్మిణి అన్నారు.ఈ నేపథ్యంలో మా ఓట్లు అమ్మకానికి కావు, సేవకులకే మా ఓట్లు అంటూ ఫ్లక్సీని ఇంటి ముందు ఏర్పాటు చేశారు.ఓట్లను అడగడానికి తమ ఇంటికి వచ్చే నాయకులను సైతం ఆలోచనలో పడేసే వినూత్న ప్రయత్నం నాయకులలో మార్పు రావాలని కోరుకుందాం.

## అన్నదానం.. మహాదానం

**ప్రజాపక్షం/వలిగొండ** : వలిగొండ మండలంలోని వేములకొండ గ్రామంలో అయ్యప్ప మాలధారణ ధరించిన స్వాములకు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ఏర్పుల వెంకటేశం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప మాలదారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం పూర్వజన్మ సుకృతమని, 45 రోజులపాటు కఠోర దీక్షను అయ్యప్ప స్వామి కోసం చేయడం ఎంతో పుణ్యమని వారన్నారు.





## అన్నదానం మహాదానం

**ప్రజాపక్షం/కోదాడ:** మాలధారులకు నిత్య అన్నదానం మహాదానమని కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డా॥ పి.పెంటయ్య అన్నారు. గురువారం కోదాడ పట్టణ హుజూన్‌నగర్ రోడ్డులో పట్టణ ప్రముఖ న్యాయవాది, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు, కాంగ్రేస్ పట్టణ నాయకులు గాలి శ్రీనివాస్‌నాయుడు తన సోదరుడు గాలి రమేష్‌నాయుడు జ్ఞాపకార్థం సన్నిదానంలో నిర్వహిస్తున్న అన్నదానాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత 12 సంవత్సరాలుగా మాలధారులకు అన్నదాన కార్ర్యమాన్ని నిర్వహించడం ఓక యజ్ఞం లాంటిదని అన్నారు. తొలుత నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో సీతారాంసింగ్, నాగరాజు, రామారావు,వెంకటేశ్వర్లు, నాగేశ్వరావు, ఉపేందర్, రమణ, కోటయ్య, శ్రీనివాస్, సాయిరాజు, గురుస్వాములు, మలధారులు పాల్గొన్నారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



**ప్రజాపక్షం/గుండాల** : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని విశ్వవాణి చర్చి నందు గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. పాస్టర్స్ మాట్లాడుతూ సంఘాస్తులకు గ్రామస్తులకు క్రీస్తు సందేశాలను ఆశీర్వదా వచనలను ప్రసంగించడం జరిగింది. మండల కేంద్రంలోని రెవిన్యూ డిపార్ట్మెంట్‌లో పనిచేసినటువంటి కాంతారావు కుటుంబం సెమీ క్రిస్మస్ సందర్భంగా సంఘ సభ్యులకు పేదలకు వృద్ధులకు క్రిస్మస్ కానుకలను పంపిణి చేయడం జరిగింది. ప్రభువు ఆశ్శీలతో అందరు సుఖసంతోషాలతో జీవించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పార్టర్స్ వెంకటయ్య, అనిల్‌బాబు, భాస్కర్, సురేష్, సంఘ విశ్వాసులు బొజ్జగాని, శారదా, రాజకుమార్, ప్రభాకర్, ధార, సతీష్, రమేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

## మహా అన్న ప్రసాదం వితరణ



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి సన్నిధిలో సత్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతినెల పౌర్ణమి అమావాస్య రోజులను పురస్కరించుకొని స్వామివారి అన్న మహా ప్రసాదం వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గురువారం పౌర్ణమి రోజున పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు దేవస్థానము అర్చకులు బ్రహ్మశ్రీ ఉత్తరపల్లి అనంత చార్యులచే నిర్వహించి. భక్తులందరికీ ఆ స్వామి వారి దివ్య దర్శనం గోత్రనామ అర్చన తీర్థ ప్రసాదాల వితరణ తదుపరి స్వామి వారి మహా నైవేద్యం భక్తులందరికీ అన్న ప్రసాదం వితరణ కార్యక్రమం నిర్వహించినట్లు స్వామివారి అన్న ప్రసాదం కార్యక్రమం ఫౌండర్ గడగోజు సత్యనారాయణ చారి తెలిపారు.

## రెండవ రోజున నామినేషన్ల పర్వం

**ప్రజాపక్షం/మోటకొండూర్:** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా మోటకొండూరు మండలంలో రెండవ రోజు 13 మంది సర్పంచ్ అభ్యర్థులు, 44 వార్డు సభ్యులు నామినేషన్లు దాఖలు చేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఇందిర తెలిపారు.

# ఏకగ్రీవ గ్రామపంచాయతీలలో ఎన్నికల కోడ్ అమలు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ఏకగ్రీవ గ్రామపంచాయతీలలో సైతం ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీ కుముదిని తెలిపారు.గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేయాలని ఆమె చెప్పారు.గురువారం ఆమె హైదరాబాద్ నుండి జిల్లాలకు కేటాయించబడిన ఎన్నికల పరిశీలకులు, జిల్లాల కలెక్టర్లు, పంచాయితీ రాజ్, పోలీస్ అధికారుల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్టేజ్ 2, జోనల్ అధికారులకు శిక్షణ , సర్వీస్ ఓటర్లు, పోస్టల్ బ్యాలెట్ ఏర్పాట్లు, వెబ్ కాస్టింగ్, ఓటర్ స్లిప్పుల పంపిణీ షెడ్యూల్ తదితర అంశాలపై కమిషనర్ ఆయా జిల్లాల వారీగా సమీక్షించారు. రాష్ట్రంలోని కొన్ని గ్రామపంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికైనప్పటికీ ఎన్నికలు ముగిసే వరకు అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు ఉంటుందని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి అన్ని నిబంధనలు తు.చ తప్పకుండా పాటించాలని అన్నారు. పంచాయతీ ఎన్నికల ఫలితాల ప్రకటన నియమాలు, ఏకగ్రీవ స్థానాలలో ఉపసర్పంచ్ ఎన్నిక, పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు, నామినేషన్ల పై వచ్చే ఫిర్యాదులు, తదితర అంశాల పట్ల ఎన్నికల అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వార్డు సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామాలలో ఉప సర్పంచ్ నియామకం నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని అన్నారు. ఫారం 10 ప్రకారం ఫలితాల ప్రకటన చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు,ఐఏఎస్ అధికారిణి కొర్రా లక్ష్మీ,జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్,అదనపు ఎస్పి రమేష్, పంచాయతీ అధికారి వెంకయ్య,జెడ్పి సీఈఓ శ్రీనివాసరావు,ఆర్డిఓ వై.అశోక్ రెడ్డి ఉన్నారు.

## జిల్లాలలో పంచాయతీ ఎన్నికలను నిబంధన ప్రకారం నిర్వహించాలి

ప్రజాపక్షం/యాదాద్రి : జిల్లాలలో పంచాయతీ ఎన్నికలను నిబంధన ప్రకారం నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ.రాణి కుముదిని అన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ.రాణి కుముదిని జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పంచాయతీ ఎన్నికల ఫలితాల ప్రకటన నియమాలు, ఏకగ్రీవ స్థానాలలో ఉపసర్పంచ్ ఎన్నిక, పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు, నామినేషన్ల పై వచ్చే ఫిర్యాదులు, తదితర అంశాల పట్ల ఎన్నికల కమిషనర్ రివ్యూ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, జిల్లా, పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సమన్వయంతో పనిచేయండి

**-పోలీసు అధికారులకు సిపి ఆదేశం**

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : పటిష్ట బందోబస్తు, సమన్వయంతో గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతం చేయాలని జిల్లా పోలీసు అధికారులకు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. గురువారం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, సెక్టార్ అధికారులతో బందోబస్తుపై నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన పలు సూచనలు చేశారు. ఎటువంటి ఘర్షణలు, వివాదాలు, ఆరోపణలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో నిశితంగా పర్యవేక్షించాలన్నారు. స్వేచ్ఛయుత వాతావరణంలో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసు యంత్రంగం పనిచేయాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను ముందస్తుగా బైండవర్లు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం విక్రయాలు, బెల్టు షాపులను కట్టడిచేయడంతో పాటు సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈకాన్ఫరేన్స్‌లో ఆయన వెంట అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి మహేష్, సిబి రాజిరెడ్డి ఉన్నారు.

## ఏకగ్రీవాల్లో ఉప సర్పంచ్‌ల ఎన్నిక

ప్రజాపక్షం/ రఘునాథపాలెం : ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్‌ల ఎన్నిక గురువారం నిర్వహించారు. మండల పరిధిలోని రేగులచలక, మల్లేపల్లి, రాములుతండా, మంగ్యాతండా గ్రామ పంచాయతీలు సర్పంచ్ స్థానంతో పాటు వార్డు స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవమయ్యాయి. ఆయా గ్రామ పంచాయతీల్లో ఆర్‌వోల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికైన వారికి పత్రాలు అందజేశారు. అనంతరం ఉప సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రేగులచలక ఉప సర్పంచ్‌గా బీఆర్ఎస్ తరుపున నున్నా వెంకటేశ్వర్లు, మల్లెపల్లి ఉప సర్పంచ్‌గా కాంగ్రెస్‌కు చెందిన బండి వెంకన్న, రాములుతండా ఉప సర్పంచ్‌గా బిఆర్ఎస్‌కు చెందిన గుగులోత్ మానస, మంగ్యాతండా ఉప సర్పంచ్‌గా బిఆర్ఎస్‌కు చెందిన గుగులోత్ నాగేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నిక నిర్వహించారు. బండి వెంకన్న గత ఎన్నికల్లో మల్లెపల్లిలో సర్పంచ్‌గా పనిచేశారు. నున్నా వెంకటేశ్వర్లు గత ఎన్నికల్లో రేగులచలక ఉప సర్పంచ్‌గా పనిచేశారు. మరల ఈ ఎన్నికల్లో కూడా ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన పాలక వర్గ సభ్యులను అధికారులు, గ్రామస్తులు అభినందించారు.

## సర్పంచ్‌గా నిర్మలాకుమారి ప్రమాణస్వీకారం

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : మండల పరిధిలోని జమలాపురం గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన కెవిఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు సతీమణి, కమ్మ సంఘం కోశాధికారి తుళ్లూరి నిర్మలాకుమారి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. సర్పంచ్‌తో పాటు 10వార్డు స్థానాలు కూడా ఏకగ్రీవం కావడంతో మండల స్పెషల్ ఆఫీసర్ విజయ్‌చంద్ర, ఆర్‌వో గంటా కృష్ణ, కార్యదర్శి కుమార్ ఆధ్వర్యంలో నియమాక పత్రాలను అందజేశారు. సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్‌గా ఎన్నికైన చట్టు పార్వతి, వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నిర్మలా కుమారి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గ్రామస్తులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అదేవిధంగా ఏకగ్రీవమైన కండ్రిక, సత్యనారాయణపురం గ్రామ సర్పంచ్‌లకు ఎన్నికల అధికారి విజయ్‌చంద్ర, ఆర్‌వో గంటా కృష్ణ ఆధ్వర్యంలో నియామక పత్రాలను అందించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానికులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అటవీ భూముల ఆక్రమణను అనుమతించొద్దు

**–అటవీ సంరక్షణ కమిటీ సమావేశంలో కలెక్టర్**

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జిల్లాలోని అటవీ భూముల ఆక్రమణకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన అటవీ సంరక్షణ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి కాలువల నిర్మాణానికి అవసరమైన అటవీ భూముల సేకరణ నిమిత్తం అటవీ శాఖకు ప్రత్యామ్నాయ భూ కేటాయింపు కోసం గిరిజన కార్పోరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న వంద ఎకరాలు బదిలీ చేసేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. భూమిని గుర్తించి 15 రోజులు గడిచినప్పటికీ ఎటువంటి పురోగతి లేకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పోడు భూముల పట్టా పొందిన కొంత మంది రైతులను మధ్యవర్తి సమీపంలో ఉన్న అటవీ భూముల ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందుతుందని రెవెన్యూ, అటవీ శాఖాధికారులు అప్రమత్తంగా ఉంటూ ఇంచు అటవీ భూమి కూడా అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. వైల్డ్ లైఫ్ సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, అటవీ జంతువులను వేటాడితే రూ. 25వేల నుంచి లక్ష రూపాయల వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. పోడు పట్టా ఉన్నవారు ఎవరైనా అడవి జంతువుల వేటకు పాల్పడినా, అటవీ భూములను ఆక్రమించిన గతంలో జారీ చేసిన పట్టా రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీ ప్రాంతంలో పోడు భూములలో 11కెవి లైన్లలో ప్రాధాన్యత క్రమంలో ఇన్సులేట్ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నీలాద్రి అర్బన్ పార్కు పక్కన ఉన్న సింగరేణి కాలరీస్ బ్లాస్టింగ్ సమయంలో జింకలు పార్కు కాంపౌండ్ వాల్ దూకి రోడ్లపైకి వచ్చి ప్రమాదాల భారీనపడుతున్నాయని కాంపౌండ్ వాల్ ఎత్తును పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నీలాద్రి, వెలుగుమట్ల, పులిగుండాల, అర్బన్ పార్కులను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, యువత, పిల్లలను ఆకర్షించేలా పార్కుల్లో జంతువులను ఏర్పాటు చేయాలన్నారు. రెండు విడతలలో జిల్లాలో కనీసం 100 వెట్ ల్యాండ్లను గుర్తించి నోటిఫికేషన్ జారీ చేయాలని , వెట్ ల్యాండ్ వద్ద పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటే 90 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ వస్తుందన్నారు. ఇరిగేషన్ ఎస్ఈ ఎన్. వెంకటేశ్వర్లు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విజయలక్ష్మి పాల్గొన్నారు.

## కొత్త గ్రామపంచాయతీకి ఏకగ్రీవ సారధి!



ప్రజాపక్షం/హాలియా: దశాబ్దాలుగా తమ గ్రామాన్ని గ్రామపంచాయతీగా చేయాలంటూ ఆ గ్రామవాసులు చేసిన ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. తమను తాము పరిపాలించుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించడంతో ఆ గ్రామ ప్రజలు సంబరాల్లో మునిగిపోయారు. అనుకున్నదే తడవుగా పంచాయతీ ఎన్నికలు కూడా రావడంతో ఇక తామని తాము పరిపాలించుకునే సువర్ణ అవకాశం ఆసన్నమైనదంటూ ఆ గ్రామస్తుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.. ఇంతకీ ఏదా గ్రామం అనుకుంటున్నారా ! చెప్తున్నాను ఆగండి ... ఇక చదవండి ఆ గ్రామం ఏదో. అనుముల మండలంలోని యాచారం గ్రామపంచాయతీ పరిధిలో భాగమైన కాశి వారి గూడెం గ్రామమే ఇప్పుడు పంచాయతీ గా ఏర్పడింది. సుమారు 600 మంది జనాభా గల ఈ కాశి వారి గూడెం మొదటి నుంచి యాచారం పంచాయతీలో భాగంగా ఉండేది. గత కొన్నాళ్లుగా ఈ గ్రామస్తులు తమకు ప్రత్యేక పంచాయతీ కావాలని పలుమార్లు అప్పటి అధికార పార్టీ ఎమ్మెల్యేకీ ఎమ్మెల్సీకి వినతులు చేశారు. అదే టిఆర్ఎస్ ప్రభుత్వంలోని ఈ గ్రామం కొత్త పంచాయతీగా ఏర్పాటు కావాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాల వలన కొంత జాప్యం జరిగింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక పెద్దలు కుందూరు జానారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి చొరవతో కొత్తగా ఏర్పాటుచేసిన పంచాయతీలతోపాటు కాశి వారి గూడెం గ్రామాన్ని కూడా పంచాయతీ గా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా మొదటి ఎన్నికల్లో గ్రామస్తులంతా ఏకమై తమ గ్రామాన్ని ఏకగ్రీవంగా చేసుకునేందుకు నిర్ణయించుకున్నారు. దీనిలో భాగంగానే రెండో విడత ఎన్నికల్లో నవంబర్ 30 నుంచి డిసెంబర్ రెండు వరకు జరిగిన నామినేషన్ల ప్రక్రియలో కాశి వారి గూడెం నుంచి షేక్ కరీం అనే వ్యక్తి మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో షేక్ కరీం అనే వ్యక్తి సర్పంచ్ గా ఏకగ్రీవం అయినట్లు తెలిసింది. అయితే దీనిపై అధికారులు మాత్రం అధికారికంగా తామేమి చెప్పలేమని చెబుతున్నారు. ఒక గ్రామంలో ఒక్కరే నామినేషన్ వేశారంటే వారు ఎదుట వ్యక్తులని బెదిరించి బలవంతంగా నామినేషన్లు వేయకుండా అడ్డుకుని ఉండడం వల్లనే ఎవ్వరు నామినేషన్ వేసి ఉండరనే అభిప్రాయం అధికారులు వ్యక్తమౌతుంది. దీనిపైనే ఒక స్పష్టత వచ్చిన తర్వాత అధికారికంగా ఏకగ్రీవాలను ప్రకటించనున్నట్లు అధికారులు చెప్పడం గమనార్హం.

# ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



**-ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలి**
**-అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు**



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని, ఎన్నికలు సజావుగా ఎలాంటి అవాంతరాలు లేకుండా జరిగేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని ఖమ్మం డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రఘునాథపాలెం మండలంలో ఎన్నికలకు నామినేషన్ వేసిన సర్పంచ్, వార్డు సభ్యులతో గురువారం గణేష్ గార్డెన్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి మాట్లాడుతూ ఎన్నికలను నిష్పక్షికంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఆరోపణలకు ఆస్కారం లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత కీలకమని, స్థానిక ఎన్నికలను అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు, భయభ్రాంతులకు లోనుకాకుండా స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన వాతావరణం కల్పించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అన్నారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి, సిఐ ఉస్మాన్ షరీఫ్, ఎస్ఐలు నరేష్, తేజశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

# యువత స్వయం ఉపాధితో ఎదగాలి

**విలేజ్ బెల్లం చాయ్ కేఫ్ ప్రారంభంలో**
**కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి**




**ప్రజాపక్షం/వైరా:** వైరా ఆర్‌టిసి బస్టాండ్ కాంప్లెక్స్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన విలేజ్ కేఫ్‌ను గురువారం జిల్లా కాంగ్రెస్ అధ్యులు నూతి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేఫ్ నిర్వాహకుడు బత్తుల రవిని ఆయన అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ మాట్లాడుతూ యువత స్వయం ఉపాధితో ఎదిగి మంచి భవిష్యత్తుకు పునాది తీసుకోవాలని నేటి యువత చెడు వ్యసనాలకు లోనై బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని అన్నారు. బెల్లం చాయ్ ఆరోగ్యానికి ఎంతో మంచిదని అన్నారు. అనంతరం నూతి సత్యనారాయణ గౌడ్‌ను ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, వైరా పట్టణ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, మాజీ మున్సిపాల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, పొదిలి హరినాథ్, గంగులు, వేముల రత్నాకర్, పెద్దప్రోలు లక్ష్మయ్య, వీరంశెట్టి సీతారాములు, ఆర్యవైశ్య కార్పొరేషన్ జిల్లా ఇంచార్జి గ్రంధి ప్రవీణ్, మిట్టపల్లి శ్రీనివాసరావు, బాబు సాహెబ్, మిట్టపల్లి నాగేశ్వరరావు, ముళ్ళపాటి రంగా, మరికంటి రాంగోపాల్, గుండెల రవి తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్థులు మేనిఫెస్టోను ప్రజలతో పంచుకోండి

**సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, బిపిసిటి చైర్మన్ వాసంశెట్టి**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అమ్మగూడెం పంచాయతీ లో పోటీ చేసే అభ్యర్థులు వారి మేనిఫెస్టోను ప్రజలతో పంచుకోవాలని స్థానికుడు, సాఫ్ట్వేర్ ఇంజనీర్, బీపీసీటీ చైర్మన్ వాసంశెట్టి పూర్ణచంద్రరావు సూచించారు. గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 40 ఏళ్ల గా గ్రామం అనుకున్నంత అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. కనుక ప్రస్తుతం పోటీలో ఉన్న అభ్యర్థులు గ్రామానికి అభివృద్ధి చేసేందుకు వచ్చే 5 ఏళ్లలో చేసే పనులను మేనిఫస్టో ద్వారా ఓటర్ల కు తెలియజేయాలని సూచించారు. గ్రామంలో ఆలయం నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలి. అయ్యప్ప స్వామి సన్నిదానం నిర్మాణం పూర్తి కావటానికి అవసరమైన సహకారం అందించాలన్నారు. వీరన్న స్వామి ఆలయఅభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయాలని కోరారు. ఫ్యాక్టరీ వద్ద అయ్యప్ప ఆలయం నిర్మాణం చేపట్టాలి. ఫ్యాక్టరీ నుంచి వస్తున్న కాలుష్యం ను తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి. ఫ్యాక్టరీ నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. నిజమైన అభివృద్ధి కావాలంటే స్పష్టమైన విజన్, బలమైన ప్రణాళికలు, ప్రజా సమస్యలపై నిజమైన స్పందన అవసరం అన్నారు. ఇరువురు అభ్యర్థులు మేనిఫెస్టో ను ఓటర్లకు వివరించి, గ్రామాభివృద్ధి కి పాటుపడాలని కోరారు. గ్రామాభివృద్ధి లో తాను శక్తి వంచన లేకుండా తన వంతుగా సహాయం చేస్తామన్నారు.

# కాంగ్రెస్ నుండి పలువురు బిఆర్ఎస్‌లో చేరిక



**ప్రజాపక్షం/ఇల్లందు :** ఇల్లందు నియోజకవర్గంలోని ఇల్లందు మండలం రొంపేడు, విజయలక్ష్మి నగర్, తిలక్‌నగర్ నుండి కాంగ్రెస్, న్యూడెమోక్రసీ పార్టీల నుండి మాజీ సర్పంచ్ అజ్మీర శంకర్, అజ్మీర పార్వతి, ఎంఎల్ పార్టీకి చెందిన వార్డు సభ్యులు బానోత్ దుగ్యా, బానోత్ పార్వతి, కిరణ్, రాంబాబు, బాలరాజు, వీరు, రామచందర్, న్యూ డెమోక్రసీకి చెందిన 50 కుటుంబాలు గులాబీ తీర్థాన్ని పుచ్చుకున్నారు. పార్టీలోకి చేరిన వారికి ఇల్లందు మాజీ ఎంఎల్‌ఏ హరిప్రియనాయక్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తికల్‌నగర్, విజయలక్ష్మి నగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ మండల ఆయకులు సువర్ణపాక సత్యనారాయణ ఆధ్వర్యంలో మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ దిండిగల రాజేందర్ నేతృత్వంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా మాజీ ఎంఎల్‌ఏ హరిప్రియనాయక్, దిండిగల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామరక్ష లాంటిది తొలి ముఖ్యమంత్రి వర్యులు కేసీఆర్ పాలనని, కేసీఆర్ హయాంలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయితీని అభివృద్ధి చేసుకోవడం జరిగిందని, మారుమూల పల్లెలకు కూడా కేసీఆర్ డిఎంఎఫ్టి నిధుల ద్వారా నియోజకవర్గంలో ప్రతి మారుమూల ప్రాంతాన్ని కూడా అభివృద్ధి పథంలో ముందుకు నడిపించడం జరిగిందన్నారు. ఈసందర్భంగా పార్టీలోకి చేరిన వారిని ఆహ్వానం పలుకుతూ పార్టీ పునర్నిర్మాణంలో భాగంగా అహర్నిశలు కృషి చేయాలని తెలియజేస్తూ పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో రంగనాథ్, పరుచూరి వెంకటేశ్వర్లు, జబ్బర్, మూడ్ హనుమాన్, బావ్‌సింగ్, అబ్దుల్ నబీ, లలిత్ పాసి, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల పెట్రోలింగ్



**ప్రజాపక్షం/వైరా:** రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో సమస్యాత్మక గ్రామాల్లో వైరా పోలీసులు తమ సిబ్బందితో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. గతంలో ఎన్నికల్లో ఘర్షణలు జరిగిన గ్రామాల్లో వైరా ఎస్సై పుప్పాల రామారావు ఆధ్వర్యంలో సెక్టార్ అధికారి ఎస్సై పవన్, ఏఎస్ఐ యేసు, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో గొల్లపూడి గ్రామంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి అనంతరం గ్రామస్థులతో మాట్లాడారు.

## దేవాలయం మాజీ చైర్మన్ కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక శ్రీ రాజగోపాలస్వామి దేవాలయం మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు, మేజర్ పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు కురాకుల నాగేశ్వరరావు గురువారం రాత్రి కాంగ్రెస్ లో చేరారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన తన అనుచరులతో కాంగ్రె స్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాల అమలు, మంత్రి శ్రీనివాసరెడ్డి చేస్తున్న అభివృద్ధి పనుల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. నేలకొండపలి మేజర్ పంచాయతీ సర్పంచ్ గా ఉన్నత విద్యావంతురాలు అభ్యర్థి పుసుపులేటి శ్రీలత ద్వారా మేజర్ పంచాయతీ అభివృద్ధి జరుగుతుందని ఆకాంక్షించారు. గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాయపూడి నవీన్, మాజీ ఉప సర్పంచ్ లక్కం ఏడుకొండలు పి.శ్రీనివాస్, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధిగా రోశయ్య సేవలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** ప్రజాప్రతినిధిగా కొణిజేటి రోశయ్య సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య నాల్గవ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఇతర రాష్ట్రాల గవర్నర్‌గా విశిష్టమైన సేవలు అందించారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక భవిష్యత్‌కు ఎన్నో ఆర్థిక సంస్కరణలు చేశారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు పరంధామరెడ్డి, విజయలక్ష్మి, రామిరెడ్డి తదితరుల శాఖల అధికారులు పాల్గొన్నారు.

## లోక్ ఆదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం జిల్లా కోర్టులో ఈనెల 21న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్, కార్యదర్శి రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సిడెంట్ కేసులు, సివిల్ కేసులు, చీటింగ్ కేసులు, చిట్‌ఫండ్ కేసులు, భూతగాదాలు, వివాహ బంధానికి చెందిన కేసులు, ట్రాఫిక్ చాలానా, డ్రక్ అండ్ డ్రైవ్ కేసులు, కుటుంబ తగాదాలు, బ్యాంకు లావాదేవీల కేసులు, బ్యాంకు లావాదేవీలు, టెలిఫోన్ బకాయిల కేసులు, కొట్టుకున్నకేసులు, సైబర్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు ఈ లోక్ అదాలత్‌లో లాజీ చేసుకుని కేసులను పూర్తి చేసుకోవాలని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## ప్రశాంతంగా పంచాయతీ ఎన్నికలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండల పరిధిలోని పంచాయితీ ఎన్నికలు నిర్వహించే గ్రామాలలో సర్పంచ్, వార్డ్ అభ్యర్థులతో అశ్వాపురం మండల సిఐ అశోక్‌రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్నికల ప్రశాంతంగా నడిచే విధంగా చూడాలని అన్నారు. ఈకార్యక్రమంలో మండల ప్రజలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మల్లెలమడుగులో దూసుకుపోతున్న బిఆర్ఎస్



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలంలోని మల్లెలమడుగు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో సిపిఎం పార్టీ బలపరిచిన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బండారు బలరాం ఎన్నికల ప్రచారంలో వేగంగా దూసుకుపోతున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలలో తనపై నమ్మకం ఉంచి గెలిపించాలని కోరుతూ గెలిచిన వెంటనే గ్రామంలోని ప్రజలకు పలు హామీలు ఇస్తూ రోడ్లు, నీరు, బడులు, గుడులు లాంటివి ఏ సమస్యలున్న పరిష్కరిస్తానని, ప్రజలకు ఉపయోగపడే ప్రతి పనిని సమర్ధవంతంగా చేస్తానని ఎవరికి ఏ అతీత శక్తులకు లొంగనని మల్లెల మడుగు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ప్రచార హామీలు ఇచ్చారు. ఆయన కత్తెర గుర్తును చూపిస్తూ ఆ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు.